# విమల

## ౧

"అన్నయ్యా! నేను వెళ్తున్నాను" అంది విమల.

"ఎక్కడికి? నిజంగానా?" అని ఉలిక్కిపడి లేచాడు సీతాపతి.

"ఇవాళ పనిలో ప్రవేశిస్తానని మాటయిచ్చాను. పెందలకడే వెళ్ళాలి" అని విమల అన్న ముఖంకేసి చూచింది. మాటల కందని బాధ అన్న ముఖంమీద నల్లటినీడల్లాగా అలుముకుంది. ఎవరికి కష్టం కలిగినా సరే వెళ్ళటానికే విమల నిశ్చయించుకుంది.

"ఎంత చేతకాని వాణ్ణయిపోయానమ్మా?" అని బరువుగా నిట్టూర్చి పక్కమీదినించి లేచాడు సీతాపతి.

"అనవసరంగా బాధపడ కన్నయ్యా! వేడినీళ్లకి చన్నీళ్లు తోడు. నీ ఒక్కడి రెక్కలకష్టం ఇంతమంది కూచుని తినటానికి ఎల్లా సరిపోతుంది? ఎవరి పొట్టకోసం వాళ్లు కష్టపడటం తప్పేమిటి?" అని తన నిశ్చయాన్ని మరొకసారి వెల్లడించింది విమల.

గదిలో చినిగిన చాపలమీద నలుగురు పిల్లలూ.... నెలలు నిండిన వదినా.... ఇంకోమూల పక్షవాతంతో మంచానపడ్డ తండ్రి, ఇంట్లోవున్న ఒకే నులకమంచంమీద మాసిన బొంతమీద పడుకున్న అన్న, తూర్పువేపుగా వున్న ఒకే చిన్న కిటికీలోంచి వేకువ వెలుగులు చిమ్ముతున్న ఆకాశం కనిపిస్తోంది.

"నాన్నతో చెప్పావా?" అని హీనస్వరంతో అడిగాడు సీతాపతి.

"ఇక నే నెవరికీ చెప్పదలుచుకోలేదు. నీ అనుమతి దొరికితే చాలు" అంది విమల.

నోట మాటరాక దిండుమీద తల వాల్చాడు సీతాపతి. పెళ్లికాని చెల్లెలు సంసార పరిస్థితులు భరించలేక ఒక సంపన్నుల ఇంట్లో పగలంతా పనిచేసే వంటమనిషిగా కుదరబోతుంది. ఏ అన్న దీవించి పంపగలడు? నలుగురూ తనని ఎన్నివిధాల ఆడిపోస్తారు? పెళ్లి చెయ్యటంకోసం కాళ్లు అరగిపోయేట్లు తిరిగాడు. ఎవర్ని చూడ బోదామన్నా వేలమాటేకాని ఇంకోటిలేదు. విమలకి ఇరవైయేళ్లు దాటినా ఎక్కడా సంబంధం కలిసిరాలేదు. లేని సంసారం కావటంవల్ల చదువూ సంగీతం చెప్పించలేదు. ఎప్పటికైనా విమల పెళ్లి తన చేతులమీద చెయ్యగలనా అనే దిగులు సీతాపతిని వేదిస్తున్నది. తనకి వచ్చే అరవైరూపాయలే అందరికీ ఆధారం! పెళ్లికాకపోతే చదివిద్దామంటే తనకి తాహత్తు లేదు. మనస్సులో విమల పడుతున్న బాధంతా అన్నకి తెలుసు. తన ఆర్థిక సంకటానికి విమల చూపుతున్న పరిష్కార మార్గం సీతాపతికి సుతరామూ గిట్టటంలేదు. మధ్యతరగతి కుటుంబాలకి అర్థబలం తక్కువైనా అభిమానానికి లోటులేదు. పెనగులాడి అయినా మితిమీరిన ప్రతిష్ఠల బరువు మోయాలని చూస్తారు. తన అవివాహితసోదరి ఇంకొకచోట ఊడిగం చెయ్యటం ఎంతనామర్దా! అష్టకష్టాలు పడుతూ, తనమీద భారమంతావేసి, తను తెచ్చే అరవై రాళ్లతో అర్ధాకలితో అగచాట్లు పడటమే ఘనంగా కనబడు తుంది. తన వంశం ఎంత పేరుమోసింది! తమ ఇంట్లో పుట్టిన కన్య పొట్ట చేత పట్టుకొని ఇంకోచోట చాకిరికి కుదరటమా? నలుగురిలో తనకెంత తలవంపు! అంతకంటే అప్రతిష్టపని వుంటుందీ?

"వద్దమ్మా విమలా ! నీకు పుణ్యంవుంటుంది. నా పరువు కాపాడు. నా మాట విను" అని కూలిపోనున్న ప్రతిష్ఠల కోటని నిలబెట్టే వుద్దేశంతో బతిమాలుతూ అన్నాడు.

"ఎవరి కాళ్లమీద వాళ్లు నిలబడటంలో పరువు తక్కువేమి టన్నయ్యా ? బాగా ఆలోచించు. నేను వస్తానని మాటయిచ్చాను. వెళ్లక తప్పదు." అని గడప దాటిపోయింది విమల.

ఎడపిల్ల లేచి కెవ్వుమన్నది సగంనిద్రలో వున్న తల్లిని తన్నుతూ. పక్షవాతంతో మాట గొణుగుడుపడిన తండ్రి ఏమిటో అంటూ చేతులూపుతున్నాడు.

సీతాపతి కొరడాదెబ్బ తగిలినట్లు చివాలునలేచి నిలబడ్డాడు.

౨

"నీ పేరేమిటే అమ్మాయ్ ? కొంచెం వేడినీళ్లు ఆ రబ్బరు సంచీలో పోసి త్వరగా తెచ్చిపెట్టు.... శ్.... అమ్మా.... అబ్బా...." అన్నది సోఫాలో కాళ్లుజాపుకుని కూచుని ఆపసోపాలు పడుతూ ఇంటి యజమానురాలు సీతారామమ్మ.

"వస్తున్నానండీ, అమ్మాయిగారికి కాఫీకలిపి ఇచ్చివస్తాను" అని వంటింట్లోంచి కేకపెట్టింది విమల. కోడికూతతో మేలుకొని రాత్రి పదిగంటలదాకా మరలాగా కాళ్లూచేతులూ ఆడుతూవుండాలి. క్షణంసేపయినా కాళ్లు దగ్గిర పెట్టుకుని కూచోటానికి ఆ యింట్లో ఎవరికీ అలవాటులేదు. కాఫీలు, ఫలహారాలు, వంటా అన్నీ విమల చేతులమీద జరగాలిసిందే. ఎంతపనిలో వున్నా సీతారామమ్మ కేకపెట్టగానే పరుగెత్తుకెళ్లి ఆవిడ పురమాయించిన ఉపచారం చెయ్యకపోతే ఇంటికప్పు ఎగిరిపోయేట్లు కేకలు పెడుతుంది.

దాంతో రక్తపుపోటు ఎక్కువవుతుంది. అందుకని ఒకచెవి అమ్మగారి హుకుములకోసం ఎదురుచూస్తూ వుండాల్సిందే.

"ప్రాణం పోతోందే! త్వరగారావే" అని కేకపెట్టేసరికి విమల పరిగెత్తుకువచ్చి సీతారామమ్మ గుండెలమీద యూకలిప్టస్ ఆయిలు మర్దనచేసి కాపుకాచింది. కొంచెంబాధ ఉపశమించగానే సీతారామమ్మ తన శరీరంలో ఆశ్రయించిన రోగాల అద్భుత చరిత్రని గురించి అనర్గళంగా ఉపన్యసించటం ప్రారంభించింది. విని "అయ్యో! పాపం! మీరు కనక ఇన్ని జబ్బులతో వేగుతున్నారు. ఇంకొకళ్లయితేనా?.." అని సానుభూతి ప్రకటించకపోతే ఎదుటివాళ్లమీద ఎక్కడలేని కోపమూ వస్తుంది.

"నా ఆయాసం వుంది చూశావ్....పది కొట్టేసరికి మునిగిపోయినట్లు ముంచుకు వస్తుంది....తెల్లవార్లూ కళ్లలో వొత్తులు వేసుకుని కూచోవలిసిందే...కంటినిండా నిద్రపోయి ఎన్నేళ్లయిందో!

"నా కీళ్లనొప్పులు ఎన్నేళ్లయిందో పట్టుకుని ఒక్క వరసన పీడించి వేస్తున్నయ్.

"నా గుండెనొప్పి............అబ్బా! ప్రాణం అట్టిట్టయి పోవలిసిందే...."

అని అస్తమానమూ తన జబ్బులని గురించిన దండకం వల్లిస్తూ వుంటుంది. నా గుండెనొప్పి, నా అయాసం అంటూ ప్రతి రోగాన్నీ తన ఆత్మబంధువులాగా, తన అమూల్యమైన ఆస్తిలాగా ఎంతో అభిమానంతో గారాబంగా లాలిస్తూ వర్ణిస్తుంది. వింటుంటే విమల వొంటిమీద గొంగళిపురుగులు పాకుతున్నట్లు, ఆ జబ్బులన్ని తన రక్తంలోకి జొరబడుతున్నట్లు అనిపించేది. అయినా ఊఁ కొట్టక తప్పదు. వింటూ కూచుంటే, వంట ఆలస్యమైతే ఇంట్లో అంతా వొంటికాలిమీద లేచేవాళ్లే! జబ్బులు, వైద్యులు, మందులు

తప్ప సీతారామమ్మకి జీవితంలో మరొక ఆనందమే లేదనిపిస్తుంది. సోఫాలోంచి కాలుదించక్కర్లేదు....సిరిసంపదలకి తరుగులేదు. అందువల్ల ఆవిడ తీరుబాటుగా మూలుగుతూ సమస్తమైన ఉపచారాలూ జరిపించుకుంటూ బాధలలోనే మాధుర్యాన్ని కనుక్కోగలిగింది! ఇన్ని రోగాలున్నా వంటిమీద ఇస్త్రీ మడత మాయనివ్వదు. తలలో పూలచెండు వాడనివ్వదు. వండిన ఏ మంచి పదార్థమూ వృధా పోనివ్వదు....ఆవిడ నాలుక కళ్ళెంలేని గుఱ్ఱం!

"మమ్మీ! ఇవాళ కాలేజీలో డ్రామా. వచ్చేసరికే లేట్ అవుతుంది....ఓ ఫైవ్ రుపీస్ కావాలి!" అంటూ సీతాకోకచిలుకలాగా గదిలోకి వచ్చింది గారాబాలకూతురు, రెండుజడలు వేళ్లాడవేసుకుని, కులుకుతూ, వొంపులు తిరుగుతూ, నవ్వులు విసురుతూ.

"తాళం చెవులు దిండుకింద వున్నయ్. తీసుకో శశీ!" అంది తల్లి.

"ఇంకా వంట కాలేదా? పది నిమిషాల్లో కావాలి" అని హుకుం జారీచేసి "మమ్మీ! టెన్ తీసుకున్నా" తాళం చెవులు అక్కడే బడేసి తూనీగలాగా దూసుకుపోయింది శశిరేఖ.

ఆ యింట్లో అందరికీ ముద్దులమూట అయిదేళ్ల బాబు. తొమ్మిది దాటితేకాని లేవడు. లేచినాక గంటసేపు బతిమాలితేకాని పళ్ళు తోముకోడు. అటుపైన ఇంకో గంటసేపు ఈ గిన్నెకాదని ఆ కప్పూ అది కాదని ఇంకో గ్లాసూ చుట్టూపోగుచేసి కిందపోసి మీదపోసి వల్లమాలిన పేచీలుపెట్టి కాని పాలు తాగడు. ఇంటి దగ్గిర కుక్కిన పేనులాగా కంచంముందు కూచుని చద్దిఅన్నాలు తినే అన్నపిల్లలు గుర్తుకువచ్చి విమల కళ్ళు చెమ్మగిల్లేవి.

తెల్లవారకముందే కాఫీ ఫలహారాలు సేవించి ఊళ్లో సంచారానికి వెళ్ళిన అయ్యగారు ఒంటిగంటకి కాని ఇంటి ముఖం

చూడరు. ఇందుగల డందులేడని సందేహం అక్కర్లేని సర్వాంత ర్యామిలాగా ఆ వూళ్లో ఏ క్లబ్బులో చూసినా, ఏ సభలో వెతికినా. ఏ సన్మానంలో పట్టినా ఆయనే ప్రత్యక్షం ! పశుప్రదర్శనాల మొదలు కొని పరమాత్మ స్వరూపం వరకూ ఆయన ఉపన్యాస విన్యాసానికి గురికాని వస్తువులు లేవు. ఏ అధికారి బదిలీఅయివెళ్లినా, ఏమంత్రి సత్తముడు విచ్చేసినా, ఏ కవిపుంగవుడు వచ్చినా, ఏ నటీమణి శత దినోత్సవాలకి విజయంచేసినా ఆయనగారి ఉపన్యాసం లేకపోతే వీలులేదు. ఆ నగరపు సౌభాగ్యాలలో ఆయన ప్రసంగ గంగానిర్ఝరి అతిముఖ్యమైనది. ఆరేదానికీ వెలిగేదానికీ అరనిమిషం విలం బనం లేకుండా అనవరతధూమపాన తత్పరుడైన ఆయన మహా కాయం ఖాదీలాల్చీతో, సిల్కు వుత్తరీయంతో అలంకృతమై అన్ని వేళలా అన్ని తావులా కనిపిస్తూ వుంటుంది. పూర్వార్జితపు ఆస్తికి పొగాకు వ్యాపారం తోడుకావటం మూలాన కొన్ని తరాల వరకూ ఆ సంసారానికి ఏ విధమైన కొరతా వుండదు. అందువల్లనే భద్రయ్యగారు నిద్రపోయేవేళతప్ప ఇంటికి వెళ్లడు. అంతతీరిక లేని కార్యకలాపాలతో తేలి మునిగే మనిషి ఆ వూళ్లో ఇంకెవరూ లేరు.

అయ్యగారి భోజనం కూడా అయినాక విమల ఇంటిదారి పట్టింది. మిగిలిన అన్నం కూరా వంటింట్లో మూల మూత పెట్టింది. ఏ అర్ధరాత్రికో వచ్చి అయ్యగారి మొదటి సంబంధపు కొడుకు చంద్రం తినిపోతాడు. అతనంటే ఇంట్లో అందరికీ సింహ స్వప్నం. పగలంతా ఎక్కడ తిరుగుతాడో ఏంచేస్తాడో ఎవరికీ తెలియదు. గేటుదగ్గిరకి వచ్చేసరికీ మసకచీకట్లో ఆజానుబాహువు... హైరోడ్డు క్రాపు...చేతులో బెత్తం .. మెడచుట్టూ సిల్కురుమాలు...

విమల స్తంభించి పోయింది. పారిపోదామని చకచకా అడుగులు వేసింది. ఈలవేసి "ఆగు" అని అరిచాడు.

విమల ఆగింది. వణికిపోతున్న శరీరాన్ని ఎల్లాగో నిలవ రించుకుని "ఏం ?" అంది.

"ఈ యింట్లో వంటమనిషివా ?"

"అవును."

"ఎక్కడ మీ యిల్లు ?"

విమల చెప్పింది.

"ఓహో ! సీతాపతి చెల్లెలివా ? వాడు నాకు బెస్టుఫ్రెండు. పద. ఇంటిదగ్గిర దిగబెట్టివస్తా, చాలా పొద్దుపోయింది." అన్నాడు చంద్రం.

విమలకి ఎగిరిపోయిన ప్రాణం తిరిగివచ్చింది. అన్నకీ ఈ రౌడీకి స్నేహమా ? అయినా చెడ్డవాళ్ళలోకూడా అణగారిన మంచి తనం విమలకి ఆశ్చర్యం కలిగించింది.

"భయంలేదులే. నేనూ మీ అన్నా రోజూ కలుస్తాం."

"ఎక్కడ ?"

"ఇద్దరం బ్రాకెట్లు వేస్తాం. సీతాపతి ఫలాని నంబరు వస్తుం దంటేకాని నేను డబ్బుకట్టను."

"నిజంగానా ?" అని విమల గిరగిర తిరుగుతున్న ఆలోచనల్తో ముందుకి సాగింది.... ఆ యిల్లు, అక్కడి మను షులు.... అదొక క్రొత్తప్రపంచం.... అదొక వింతలోకం.... అందులో తను అడుగుపెట్టింది.... తన జీవితనాటకం ఈ వింత రంగస్థలంలో ఎటువంటి నడకసాగిస్తుందో.... ఏమో !

## 3

"నాజోలికిరాకు. అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకోకు. ఎంతలో వుండాలో అంతలోవుంటే బాగుంటుంది." అని శశిరేఖ ఇల్లు మోగిపోయేట్లు కేకలు పెట్టింది.

"ఏమిటే శశీ?" అని ఆయాసపడుతూ సీతారామమ్మ అరిచింది.

"ఆఁ ఏముంది! నీకు నౌకర్లని దూరంగా అట్టేపెట్టంరాదు. నెత్తినెక్కించుకుంటావు." అని తల్లిమీద విరుచుకు పడింది శశి.

"పొరబాటయిందమ్మా! ఇంకెప్పుడూ నేను పల్లెత్తుమాట అనను." అని విమల ఇద్దరినీ ప్రతిమాలుకుంది.

ఈ రగడ జరుగుతుంటే సంగీతంమాష్టరు మెల్లిగా జారుకున్నాడు.

సంగీతపాఠం సరససల్లాపాలతో శృంగారపాఠంగా పరిణమించటం గమనించిన విమల చూస్తూ వూరుకోలేకపోయింది. తనకంటే కొంచెం చిన్నదికదా అని చనువుతీసుకొని శశిని మందలించ బోయింది విమల. ఇక ఆ విషయంలో తను నోరు మెదపకూడదని నిశ్చయించుకుంది విమల. మర్నాటినించీ సంగీతపాఠం మేడమీద హాలులోకి మారింది. తండ్రి ఇంట్లో వుండేదిలేదు. తల్లి కీళ్లనొప్పిమూలానా మేడ ఎక్కేదిలేదు. విమలనోటికి తాళం వేసింది. రాగసుధారసంలో తనూ, సంగీతం మాష్టరూ అవధులు లేని ఆనందసుందర సీమలు చేరుకోవచ్చునని శశి ఆశపడింది.

ఒకనాటి రాత్రి పని పూర్తిచేసుకొని ఇంటికి వెళ్లబోతూ విమల రోజులాగే శశిగదిలోకి వెళ్లింది. పడుకునేముందు గ్లాసెడు పాలు తాగటం శశికి అలవాటు. పాలగ్లాసుతో విమల గదిలోకి అడుగుపెట్టేసరికి శశిరేఖ జుట్టు విరబోసుకుని పక్కమీద బోర్ల

పడుకుని వెక్కి-వెక్కి- ఏడుస్తోంది. మాట్లాడకుండా వెళ్లి గుండ్ర బల్లమీద పాలగ్లాసు పెట్టి వెనక్కి- తిరిగింది విమల. శశి తనతో మాట్లాడటం మానేసి చాలా రోజులయింది.

"విమలా !" అని పిలిచింది శశి.

"ఎందుకమ్మా అల్లా వెక్కి-వెక్కి- ఏడుస్తున్నావు ?" అని ఆప్యాయంగా పరామర్శచేసింది విమల. కట్టతెగిన ఏరులాగా కన్నీరు పొంగివచ్చి ఎంతసేపటికీ మాట్లాడలేకపోయింది. పక్క-మీద కూచుని వీపుమీద చెయ్యివేసి "ఏం ఆపద వచ్చిందమ్మా ?" అని బుజ్జగిస్తూ అడిగింది విమల, దుఃఖావేశంలో విమలని గట్టిగా కౌగిలించుకుని చెవులో రహస్యంగా చెప్పింది శశి.

"అమ్మో ! ఎంతపని జరిగింది !" అని ఆవేశం ఆపుకోలేక విమల కేకపెట్టింది.

"ఇప్పుడు నాకు దారి ఏమిటి ?" అని శశి గద్గదస్వరంతో అడిగింది. తలగడకిందవున్న సీసాని లాక్కు-ని నిబ్బరంగా అంది విమల "జరిగినదంతా పెద్దవాళ్లకి చెప్పటం తప్ప ఇంకోదారిలేదు."

"అమ్మో ! ఇంకేమైనా వుందా ?"

"భయపడి అఘాయిత్యానికి పూనుకుంటే ఆత్మహత్యతో ఇంకోప్రాణినికూడా హత్యచేసినట్లవుతుంది. ఇటువంటి ఆపద సమయాల్లో అమ్మకంటే ఆదుకుని ఆదరించేవాళ్లెవరుంటారు ?"

"అయితే ఈ సంగతి ఎవరికీ చెప్పకు. ఆ సీసా దూరంగా తీసుకుపోయి పగలగొట్టు.... చేతిలో చెయ్యివెయ్యి" అంది శశి.

"పిచ్చిదానా ! అంత అనుమానమా ?" అని విమల కిందికి దిగివచ్చింది.

తెల్లారకముందే భద్రయ్యగారూ శశీ ఎక్క-డికో వెళ్ళిపోయారు, వారండాకా తిరిగిరాలేదు,

మామూలుగా పాఠంచెప్పటానికి వచ్చిన మాష్టరు గేటు దగ్గర ఎదురైన తోటమాలి చేతిలో బాణాకర్రని చూసి వెనక్కి తిరక్కుండా పిక్కబలం చూపించాడు.

ఈ సంఘటన అవివాహితయైన విమల హృదయాన్ని భూకంపంలాగా కదిపివేసింది. గర్భదరిద్రంతో పడిన బాధకంటే విషపూరితమైన ఈ వాతావరణంలో మూగసాక్షిగా నిలబడి గిలగిల తన్నుకోవటమే దుర్భరమనిపించింది....అయినా ఇంటి దగ్గర ఇబ్బందులు....వదినకి పురుడు వచ్చే రోజులు. అన్నయ్యకి ఈ కష్టసమయంలో కాస్త ఆదుకో గలిగితే తన బాధలకి సార్థకత్వం. అందుకే ఏరోజు కారోజు మానుకుందామని మనస్సు వెనక్కి లాగినా విమల పట్టుదలగా పనిలోకి వెళ్తోంది. ఏ నిమిషంలో ఏ సంకటంలో చిక్కుకుంటానో అనే భయం....అస్తమానమూ విమల మనస్సుని కలవరపెడుతోంది.

౪

వదినకి పురుడు వచ్చింది. మళ్లీ ఆడపిల్ల. అన్నయ్యా అరవైరూపాయల వైభవానికి ఇంకో వాటాదారు! ఇంకో ఆకలికి తెరుచుకున్న నోరు!

ఇంట్లో వంటచేసి పిల్లలికి పెట్టి ఆలస్యంగా పనిలోకి వెళ్లింది విమల. భద్రయ్యా శశీ తిరిగి వచ్చారు. శశిరేఖ ఎప్పటిలాగే చలాకీగా తిరుగుతోంది. కళ్లకింద నీరసంవల్ల నల్లటి చారలు తప్ప ముఖంలో మార్పేమీ లేదు. ఏమీ ఎరగనట్లే....ఏమీ జరగనట్లే కనిపించింది శశి. "ఇంత ఆలస్యంగా వస్తే ఎల్లా?" అని మందలించింది. విమలకి ఆశ్చర్యం వేసింది. ఆపదలో ఎంత దైన్యం! గట్టెక్కగానే ఎంత ధీమా!

"ఇంటి దగ్గిర ఇబ్బందిగా వుంది. అస లివాళ మానేద్దా మనుకున్నాను. అమ్మగారు చేసుకోలేరని వచ్చాను" అంది విమల.

"ఇదుగో విమలా! కొంచెం మోకాళ్ళు తోమి వెళ్ళు...." అని సీతారామమ్మ పురమాయించింది. నేను కుదిరింది వంట చెయ్యటానికి. కాళ్ళు పిసగటానికి కాదు అని నాలుక చివరిదాకా వచ్చినా తమాయించుకుంది విమల.

ఆ రోజు బాబు అయిదో పుట్టినరోజు. భోజనాలు, పేరం టాలు....ఒకటే కోలాహలం....రాత్రి పదకొండు కొట్టేదాకా పని తెమలలేదు.

బాబు పడుకునే గదిలో ఏదో అలికిడి! పరిగెత్తుకుని వెళ్లిన విమల నిలువునా నీరైపోయింది. చంద్రం నిద్రపోతున్న బాబు చేతి మురుగు లాగుతూ కనిపించాడు. "అరిస్తే చంపుతా" చేతిలో మెరిసే కత్తితో ధడిపిస్తున్నాడు. తెలియకుండానే "దొంగ! దొంగ!" అని అరిచిందికాని కంఠం పెగల్లేదు. బల్లమీద పాల గ్లాసు కిందపడి ఖంగున మోత అయింది. మురుగు వదిలేసి గది బైటికి వచ్చి చంద్రం "దొంగ! దొంగ!" అని కేకపెట్టాడు. ఏమీ తోచక అక్కడే నిలబడిపోయింది ప్రతిమలాగా విమల.

అంతా కమ్ముకున్నారు. చుట్టేశారు. ఇంట్లోవున్న లైట్లన్నీ వెలిగినై. దొరికింది దొంగ....బాబు చేతి మురుగు ఎత్తుకు పోబో తుంటే తను పట్టుకున్నాడుట....ఖంగారులో మురుగు పక్కమీద వదిలేసిందిట....చంద్రం గొప్పయింటి బిడ్డ. మరి అతను అబద్ధం ఆడతాడా?

టెలిఫోన్ డయల్ కిర్‌కిర్ మన్నది. ముంగిట్లో పోలీసు లారీవచ్చి ఆగింది.

"అది నంగనాచి. పచ్చి దొంగ. దానికి తగిన శాస్తి చెయ్యండి!" అని శశిరేఖ సిఫార్సు చేసింది.

తను చెప్పేదంతా అబద్ధం! తన కంఠశోష అరణ్యరోదనం....నిబ్బరంగా విమల లారీవైపు నడిచింది. ఈ తలకిందులు లోకంలో దొంగ ఎవరు? దొర ఎవరు? పాడునూతిలో అట్టడుగునపడి ఆక్రందిస్తే మటుకు తనని ఎవరు పైకి తీస్తారు? ఆపదల్లో పుట్టి పెరిగిన విమల....అశ్రువులకోసమే అవతరించిన విమల....అమాయకురాలని ఎవరు నమ్ముతారు?....దొంగ అనే కళంకముద్రతో ఘరానా ఇళ్లలో వంటమనిషి పనికి కూడా యిక ముందు పనికిరాని విమల ధర్మదేవత మందిరంలోకి వెళ్లిపోయింది. కాని పాపం ఆ దేవతకి చెవులేకాని కళ్ళు లేవు! ఆ చెవులకైనా అందరి కంఠాలూ వినిపించవేమో?